# స్ఫూర్తి

-గరిశమూర్తి రాజేంద్ర

లాభంలేదు మన ప్రయాణం వాయిదా వేసుకోక తప్పదు. అంటూ పెదవి విరిచాడు సుభాష్.

ఎందుకని అసహనంగా ప్రశ్నించింది భార్య. ఏం చేయమంటావు మరి? తప్పకుండా పతాకావిష్కరణలో పాల్గొని తీరాల్సిందేనని పట్టుబడుతున్నాడు మా ఆఫీసర్. అనుకోకుండా మూడు రోజులు కలిసొస్తున్నాయని తిరుపతి యాత్రకెళ్దామని ప్లాన్ వేసుకుంటే వినిపించుకోడేం పెద్దమనిషి. అక్కడికీ అతనొక్కడే దేశభక్తుడైనట్లు! తన అశక్తతను వెలిబుచ్చింది ఝాన్సీ!



సుభాష్, ఝాన్సీ ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు. ఝాన్సీ ఆఫీసర్ ఒప్పకున్నా, సుభాష్ అధికారి ఒప్పకోకపోవడంతో తిరుపతి ప్రయాణానికి బ్రేక్ పడింది. ఆ ఆఫీసర్‌పై ఉన్న కోపాన్నంతా ప్రదర్శించి ఇలా తిట్టుకుంటున్నారు. కాని చాటుగా వీరి సంభాషణ వింటున్న సుభాష్ తండ్రి ప్రకాశం మాత్రం చాలా బాధపడ్డారు.

* * * * *

ఏదో అలికిడి అయితే సుభాష్ హఠాత్తుగా నిద్ర నుంచి మేల్కొన్నాడు. ఉదయం ఆరు కావస్తోంది. తన తండ్రిగదిలోనుండి వినబడుతున్న అలికిడి విని గదివైపు వెళ్లాడు.

ప్రకాశం త్రుప్పపట్టిన ట్రంక్ ముందు విచారంగా కూర్చున్నాడు. అతడి కళ్లలోనుంచి రెండు కన్నీటిబొట్లు రాలాయి.

నాన్నగారూ! మీ రెందుకు అంత విచారంగా వున్నారు. మీ కళ్లవెంబడి కన్నీటిబొట్లేంటి? ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.

చూడు బాబూ! జెండా ఎగరేయడం బరువైన జాతిని చూసి కళ్ల వెంబడి కన్నీళ్లొచ్చాయి. స్వతంత్రం అర్థం తెలియని ప్రజలను చూసి బాధపడుతున్నాను అన్నారు గాద్గదికంగా.

అయితే మీరు మా సంభాషణ....అంటూ ఆగిపోయాడు సుభాష్

అవునంటూ, ఈ దేశంలో చాలామంది మీలాగే ఆలోచించేవారే ఎక్కువున్నారు. స్వాతంత్ర దినోత్సవ పర్వదినాన్ని స్వంత పనులకు ఉపయోగించుకోవడానికే వినియోగిస్తున్నారు అంటూ ఆవేశంగా మాట్లాడుతున్నారు ప్రకాశంగారూ!

'క్షమించండి నాన్నా! పొరపాటయింది' నొచ్చుకుంటూ అన్నాడు సుభాష్

'ఇది నీ ఒక్కడి పొరపాటు కాదు బాబు! చాలామందికి దేశభక్తి కొరవడింది. స్వార్థం పెరిగింది. దీన్ని చూడు! ఈ మువ్వన్నెల జండా మనకు స్వాతంత్రం సిద్దించిన ఆగష్టు15వ మన ఇంటిముందే కాదు, పల్లె పల్లెన, పట్నాల్లో ప్రతీ ఇంటిముందు ప్రతీ భారతీయుడు గర్వంగా ఎగరేశాడు. దాని రెపరెపలు చూసి సంబరపడ్డాడు. జాతీయగీతం ఆలాపించి ఆనందించారు. స్వాతంత్రం కోసం పోరాడి ప్రాణాలను సైతం త్యాగం చేసిన దేశభక్తులను స్మరించారు. అలాంటిది నేడు "జండా ఎగరవేయడం దండగైపోయింది, 'జనగణమన' గీతం భారమైపోయింది." దీర్ఘంగా నిట్టూర్చాడు ప్రకాశం.

రెండు వందల సంవత్సరాల పరాయిపాలనలో మగ్గిన మనం, ఎంతో కష్టపడి, త్యాగాలు చేసి, ఈ జెండా ఎగురవేసే హక్కు సంపాదించుకున్నాం! ఆనాడు పరాయి పాలనలో త్రివర్ణ పతాకాన్ని ఎగరేయడం ఎంతో పెద్దతప్పు? అయినా లాఠీ దెబ్బలకోర్చి జెండా ఎగరేయాలని ఎంతో ఆరాటపడేవారు ఆనాటి నాయకులు. మరి నేడు ప్రతి ఒక్కరికీ జెండా ఎగురేసే హక్కున్నా ఎందుకని ఆ హక్కును వినియోగించుకోవడం లేదు? ఎవరు బాబూ, ఆనాటి స్వాతంత్ర పోరాట ఘనచరిత్రను ఈతరం వారికి భగవద్గీతలా వినిపిస్తారు? దేశభక్తి భావాన్ని ఈ ప్రజల గుండెల్లో పునఃప్రతిష్టిస్తారు? ఎవరు?...ఎవరు?...ఆవేశంగా అన్నారు ప్రకాషం.

"మీ ఉద్బోధతో నాలోని అజ్ఞానం తొలగిపోయింది నాన్నా! స్వాతంత్ర సమరయోధుడి కొడుకునై ఉండి నా కర్తవ్యం మరచినందుకు సిగ్గుపడుతున్నాను. నేను నా కర్తవ్య నిర్వహణతో పాటు తీరిక సమయాల్లో దేశభక్తి, స్వాతంత్రం, పతాకావిష్కరణ ఆవశ్యకత గురించి ప్రజలను చైతన్యం చేయడానికి నావంతు కృషి సల్పుతాను. నాలాగే మరెందరో యువకులను కార్యోన్ముఖుల్ని చేస్తానని ధృడంగా అంటున్న సుభాష్ మాటలని వింటున్న ఝాన్సీ తను కూడా భర్త ఆశయసాధనలో పాలుపంచుకుంటానని శపథం చేయడంతో ప్రకాశం గారి కళ్లలో ఆనందబాష్పాలు చెమర్చాయి.

నా కిప్పుడు సంతోషంగా వుంది. మీ ధృఢ సంకల్పాన్ని చూస్తుంటే త్వరలోనే ఈ దేశ ప్రజల గుండెల్లో దేశభక్తి, జాతీయభావాలు చోటుచేసుకుంటాయనే నమ్మకం కలుగుతుంది. తృప్తిగా అన్నారు ప్రకాశంగారు. ఏబది సంవత్సరాల జాతీయపతాకాన్ని జాగ్రత్తగా మలిచి ట్రంక్ పెట్టెలో పెడుతూ!